ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 31 ఆగస్టు 2024



భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 25.0
తణుకు : 29.0 - 25.0



మనుగడకు మొక్కలే ఆధారం

భీమవరం రూరల్, ఆగస్టు 30 : మొక్కతోనే మానవుడి జీవనాధారం ముడిపడి ఉందని, మానవులు మనుగడకు మొక్కలు విరివిగా పెంచాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి అన్నారు. శుక్రవారం బేతపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జేసీ టి రాహుల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత బేతపూడి మెయిన్ రోడ్డు వద్ద వీరు మొక్కలు నాటి అనంతరం జిల్లా పరిషత్ స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు.

నేడు పింఛన్ల పంపిణీ

భీమవరం టౌన్, ఆగస్టు 30 : వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లు శనివారం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో ఆగస్టు 31వ తేదీన పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జిల్లా అంతటా ఉదయం నుంచే పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చెయ్యాలని ఆదేశించారు. పంపిణీపై ఇప్పటికే సంబంధిత అధికారులతో కలెక్టర్ చదలవాడ నాగరాణి చర్చించారు. వాతావరణం కొంత ఇబ్బందికరంగా మారేలా కనిపిస్తోంది. జిల్లాకు సంబంధించి 2,31,075 మందికి పెన్షన్‌లను అందించటానికి 4,490 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. పర్యవేక్షించేందుక ప్రత్యేక అధికారులను నియమించారు. ఇందుకోసం పింఛన్ల కోసం రూ.96 కోట్ల 96 లక్షలు సిద్ధం చేశారు.

తెరపైకి కొత్త కలెక్టరేట్



అద్దె భవనంలో కొనసాగుతున్న కలెక్టర్ కార్యాలయం

- ప్రతిపాదనలు సిద్ధం చేసే దిశగా అడుగులు
- గతంలో ఏఎంసీ స్థలం కేటాయింపు
- ఒకేచోట ప్రభుత్వ కార్యాలయాలు ఉండేలా తాజా ప్రణాళిక
- భూసేకరణకు సన్నాహాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రమైన భీమవరంలో శాశ్వత కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. జిల్లా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా ప్రణాళిక చేస్తున్నారు. ఆ దిశగా భూసేకరణ చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు జిల్లా అధికారులకు సూచించారు. వైసీపీ హయాంలో భీమవరం ఏఎంసీ స్థలాన్ని కలెక్టరేట్ కోసం కేటాయించారు. ఉత్తర్వులు జారీచేశారు. రెవెన్యూ శాఖ మరో అడుగు ముందుకేసింది. ఆర్అండ్‌బీ శాఖకు బదలాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కానీ అప్పట్లో నిధులు మాత్రం విడుదల చేయలేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై ప్రభుత్వం పక్కనపెట్టేసింది. మార్కెట్ కమిటీ స్థలాన్ని ఇచ్చేది లేదంటూ అప్పట్లో పాలకవర్గం కూడా వ్యతిరేకించింది. మార్కెటింగ్ శాఖ కూడా అదే ఉద్దేశంతో ఉంది. అప్పటి జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వక సమాచారం కూడా ఇచ్చారు. కానీ వైసీపీ ప్రభుత్వం మార్కెట్ కమిటీ స్థలాన్ని జిల్లా కలెక్టరేట్‌కు కేటాయించింది. దాంతో ఏఎంసీ ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై మార్కెటింగ్ శాఖ తర్జనభర్జనలు పడింది. రెవెన్యూశాఖకే స్థలం చూపించాలంటూ లేఖ రాసింది. కానీ ఇంత వరకు భీమవరం ఏఎంసీ విషయంపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌తోపాటు, జిల్లాకు చెందిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట నిర్మించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అదే జరిగితే దాదాపు 40 ఎకరాల భూమి అవసరం కానుంది. ప్రస్తుతం కేటాయించిన ఏఎంసీలో 20 ఎకరాల భూమి మాత్రమే ఉంది. కార్యాలయాలన్నీ నిర్మించడానికి ఆ స్థలం సరిపోదు. ఫలితంగా అవసరమైన భూమి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ జిల్లా కలెక్టర్‌కు ప్రజాప్రతినిధులు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు సైతం కొత్త స్థలాన్ని సేకరించేందుకే మొగ్గుచూపుతున్నారు. దాంతో కలెక్టరేట్ విషయం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

ఒకేచోట కార్యాలయాలు ఉంటే..

జిల్లా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉంటే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. రవాణా సౌకర్యం ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జిల్లా కార్యాలయాలు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. అద్దెభవనంలో కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అందులోనే అత్యధిక జిల్లా కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. డీఆర్‌డీఏ, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ వంటి కార్యాలయాలను మాత్రమే ఇతర చోట్ల ఉన్నాయి. అద్దె భవనంలో కార్యాలయాలకు సరైన వసతులు లేవు. వైసీపీ హయాంలో పెద్దగా నిధులు కేటాయించలేదు. ఏలూరు నుంచే ఫర్నీచర్‌ను తెచ్చుకున్నారు. దాతల సహకారంతో వసతులు ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు కార్యాలయం ఊరుకి దూరంగా ఉంది. జనాలు కలెక్టరేట్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉంటే రవాణా సౌకర్యం కల్పించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కొత్త కలెక్టరేట్‌ను ఆ విధంగా ఏర్పాటు చేయాలని కూటమి నేతలు తలపోస్తున్నారు. గతంలో కేటాయించిన ఏఎంసీకి రవాణా సౌకర్యం ఉంది. కానీ ఏఎంసీని కోల్పోతే కొత్తగా ఏర్పాటు చేయడం మళ్లీ కష్టతరమవుతుంది. నియోజకవర్గ పరిధిలోనే ఏఎంసీ ఉండాలి. ప్రధాన రహదారులకు ఆనుకుని ఏర్పాటు చేయాలి. గోదాములు నిర్మించాలంటే అదనంగా నిధులు కేటాయించాలి. ఇవన్నీ సాధ్యమయ్యే పనికాదు. దాంతో కలెక్టరేట్‌నే కొత్తగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

16 వరకు బదిలీల గడువు పొడిగింపు

భీమవరం టౌన్, ఆగస్టు 30 : ఉద్యోగుల బదిలీలకు బ్రేక్ పడింది. వచ్చేనెల 16 వరకు గడువును పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సారిగా ఉద్యోగులకు బదిలీలు కల్పిస్తూ అవకాశం ఇచ్చింది. ఈనెలాఖరుతో ఆఖరు తేదీగా నిర్ణయించారు. దీంతో బదిలీల కోసం అధికారులు, ఉద్యోగులు తమ ప్రయత్నాలు చేసుకున్నారు. అంతే కాకుండా పనిచేసే చోట ఉండేందుకు కూడా కొంతమంది సంబంధిత ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలను తీసుకున్నారు. ఖచ్చితంగా 5 సంవత్సరాలు పూర్తయిన వారికి మాత్రమే బదిలీలు తప్పవని, ఏదైనా పరిపాలనా సౌలభ్యంతో బదిలీలు చేసే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఇక గడువు ముగియటంతో ఉత్తర్వులు వస్తాయని, తాముకోరుకున్న చోటుకు బదిలీ అవుతుందనే ఆశతో ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం కొంత షాక్ ఇచ్చింది. గుడువును వచ్చేనెల 16 వరకు పొడిగించింది. దీంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. బదిలీలు కూడా దేవదాయధర్మదాయ, మునిసిపాలిటీ, వాణిజ్యపన్నుల శాఖ, ఇలా కొన్ని శాఖలకు మాత్రమే అవకాశం కల్పించింది. ముఖ్యమైన రెవెన్యూ, పోలీస్ , ఆరోగ్య, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, ట్రెజరీ వంటి వాటిలో బదిలీలకు అవకాశం కల్పించలేదు. వీరికి వచ్చేఏడాది ఉంటాయని అంటున్నారు. ఇప్పటికే బదిలీలు ఆపాలని వాణిజ్యపన్నుల శాఖ యూనియన్ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. భోజన విరామ సమయంలో తమ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడుతున్నారు. బదిలీల గడువు పెంపువల్ల తమకు ఏమైనా ఇబ్బందులు వస్తాయా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

జిల్లాకు ప్రత్యేక అధికారి నియామకం

భీమవరం టౌన్, ఆగస్టు 30 : జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. వ్యవసాయశాఖ కార్యదర్శి ఎ.బాబును నియమించారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 26 జిల్లాలకు 26 మంది అధికారులను నియమించగా బాబును పశ్చిమగోదావరికి కేటాయించారు. సంబంధిత హెచ్‌వోడీఈలను, ఆయా జిల్లా అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలకు పర్యవేక్షణ చెయ్యవలసి ఉంటుంది.

శ్రావణ శోభ



శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అభిషేకాలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భీమవరంలో మావుళ్ళమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

ముసురు

జిల్లా అంతటా తేలికపాటి వర్షాలు



యలమంచిలి-చించినాడ రహదారిపై నిలిచిన నీరు

భీమవరం టౌన్, ఆగస్టు 30 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండటంతో జిల్లా తడిసి ముద్దయ్యింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఏసీల వాడకం తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలకు రోడ్లపై నీరు నిలిచింది. జిల్లాలో వర్షపాతం విషయాని కొస్తే తాడేపల్లిగూడెంలో 2.8 మిల్లీమీటర్లు నమోదు కాగా పెంటపాడులో 3.6, తణుకు 5.8, అత్తిలి 5.2, గణపవరం 3.6, ఆకివీడు 1.4, ఉండి 4.4, పాలకోడేరు 3.4, పెనుమంట్ర 4.4, ఇరగవరం 5.4, పెనుగొండ 4.2, ఆచంట 5.0, పోడూరు 4.2, వీరవాసరం 4.0, భీమవరం 3.6, కాళ్ల 3.2, మొగల్తూరు 2.4, నరసాపరం 7.2, పాలకొల్లు 5.4, యలమంచిలి 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లాలో 85.4 వర్షపాతం నమోదైంది.

అనూహ్యం..

మంత్రి లోకేశ్‌కు విద్యార్థుల ఫిర్యాదు
క్యాంపస్‌కు అధికారుల బృందం



విద్యార్థినులతో మాట్లాడుతున్న జేసీ

నూజివీడు/నూజివీడు టౌన్, ఆగస్టు 30: నూజివీడు ట్రిపుల్ ఐటీలో శుక్రవారం అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నా యి. వారం రోజులుగా క్యాంపస్‌లో కలుషిత ఆహారం కారణంగా వందలాది మంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. మంత్రి పార్థసారథి రెండు రోజుల క్రితం క్యాంపస్‌ను సందర్శించి నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించినా ఇంత వరకు ఆ ఆదేశాలు అమలు కాలేదు. నేటికీ నాణ్యత కొరవడిన భోజనమే విద్యార్థులకు అందుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం విద్యార్థులు తమ ఇబ్బందులపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు నాలుగు పేజీల లేఖను మెయిల్ ద్వారా పంపారు. వెంటనే స్పందించిన ఆయన ట్రిపుల్ ఐటీ చాన్సలర్ విజయ్‌కుమార్, జేసీ ధాత్రిరెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావులను క్యాంపస్‌లో విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంతలోనే హఠాత్తుగా క్యాంపస్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి సెలవుపై వెళ్లి పోయారు. సాయంత్రం నాలుగు గంటలకు అధికారుల బృందం క్యాంపస్‌కు వచ్చి విచారణ చేపట్టింది. స్టోర్ రూమ్‌ల్లో కుళ్లిన కూరగాయల తోపాటు రేషన్ బియ్యం దొరకడంతో అవాక్కయ్యారు. ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలని పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావును జేసీ ఆదేశిం చారు. అధికారులు విద్యార్థులతో సమావేశమ య్యారు. ఫుడ్‌కోర్టును త్వరలోనే మారుస్తామని అన్నారు.

మంత్రి ఉండగానే బాలికల హాస్టళ్లకు తాళాలు

మంత్రి పార్థసారథి క్యాంపస్‌ను సందర్శించిన రోజు బాలికలు ఆయనను కలవనీయకుండా అధికారులు హాస్టళ్లకు తాళాలు వేశారు. బుధవారం రాత్రి విద్యార్థులతో మంత్రి సమావేశమైనప్పుడు ఒక్క బాలిక కూడా అక్కడ లేరు. తమను హాస్టళ్లలో బంధించడంపై శుక్రవారం ఉదయం క్యాంపస్‌లో బాలికలు నిరసన వ్యక్తం చేశారు.

కనీస బిడ్ పెంపుదల మొత్తం: రూ. 25,000/-
వేలం యొక్క తేది & సమయం: 19-09-2024, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 2.00 గం॥ల వరకు
బిడ్స్ సమర్పించుటకు ఆఖరి తేది మరియు సమయం: 18-09-2024 సా॥ 4.00 గం॥ల లోపు
ఆస్తి తనిఖీ యొక్క తేది & సమయం : ప్రతిరోజు ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు

- ఐఎఫ్ఎస్‌సి కోడ్ : IBKL0000094 ని ఉపయోగించి ఖాతా నెం.09434915010026 కి ఇఎండి చెల్లించబడుతుంది. బ్రాంచ్ పేరు: ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, రాజమండ్రి బ్రాంచ్, ఆర్‌టి.జి.ఎస్. ద్వారా మాత్రమే ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్‌కు అనుకూలంగా ఉంటుంది.
- ఆసక్తి గల బిడ్డర్లు చెల్లింపు రుజువుతో పాటు పాన్ కార్డు (తప్పనిసరి), ఆధార్‌కార్డ్, పాస్‌పోర్ట్ ఓటరుఐడి కార్డ్ డ్రైవింగ్ లైసెన్స్ వం టి కెవైసి డాక్యుమెంట్‌లతో పాటు (ఫోటో గుర్తింపు మరియు చిరునామా రుజువులు) పైన పేర్కొన్న చిరునామాలోని అధీకృత అధికారికి వ్యక్తిగతంగా సమర్పించాలి. బిడ్‌ల ఆనలైన్ సమర్పణ వినోదం మరియు తిరస్కరించబడదు. బిడ్డర్ పైన పేర్కొన్న చిరునామాలో ఎ.ఒ. ని సందర్శించడం ద్వారా వ్యక్తిగతంగా అవసరమైన డాక్యుమెంట్లు మరియు ఫిల్లింగ్ ఫార్మాట్‌లతోపాటు బిడ్‌ను సమర్పించాలి.
- ఆసక్తిగల బిడ్డర్లు చెల్లించే ఇఎండి మొత్తానికి వడ్డీ ఉండదు బిడ్డర్ వేలం వేయడం ద్వారా ఇ-వేలంలో పాల్గొనకపోతే ఇఎండి జప్తు చేయబడుతుంది. ఎ.ఒ. బిడ్‌లు తెరిచిన తేదీ నుండి 3 నెలల వరకు మొదటి మూడు బిడ్డర్‌ల ఇఎండి కలిగి ఉండవచ్చు
- ఇఎండి మరియు ఇతర నిర్దేశిత పత్రాలు అందిన తర్వాత మరియు అదే అన్ని విధాలుగా క్రమంలో కనుగొనబడితే అటువంటి ఆసక్తిగల బిడ్డర్లకు "యూజర్ ఐడి" అందించబడుతుంది. ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్ అంటార్స్ సిస్టమ్స్ లిమిటెడ్ ద్వారా వారి చెల్లుబడు అయ్యే ఇ-మెయిల్ చిరునామాలకు (ఇ-వేలం పాల్గొనడానికి ఇది తప్పనిసరి) ఇమెయిల్ ద్వారా తెలియజేయును.
- విజయవంతమైన బిడ్డర్ అమ్మకం ధృవీకరణ సమయంలో లేదా ఎ.ఒ. అంగీకరించిన విధంగా పొడిగించిన వ్యవధిలో అదేరోజున అమ్మకపు ధరలో 25% (జమచేసిన ఇఎండి మొత్తం) డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. విక్రయధర యొక్క మిగిలిన మొత్తాన్ని విక్రయం ధృవీకరించబడిన 15 రోజులలోపు లేదా ఎ.ఒ. అంగీకరించిన విధంగా పొడిగించిన వ్యవధిలో చెల్లించాలి. నిర్దిష్ట వ్యవధిలోగా విజయవంతమైన బిడ్డర్ ద్వారా బ్యాలెన్స్ మొత్తాన్ని డిపాజిట్ చేయడంలోవిఫలమైతే డిపాజిట్ చేసిన మొత్తం సహా.

నిబంధనల సారాంశం :
ఎ) స్థిరాస్తిని "ఎక్కడ ఉన్నదో అలాగే", "ఏమిటి ఉంది" మరియు ఆధాం లేకుండా" విక్రయించాలని ప్రతిపాదించబడింది.
బి) స్థిరాస్తిని రిజర్వ్ ధర కంటే తక్కువకు అమ్మబడదు.
సి) విజయవంతమైన బిడ్డర్ పేరు మీద ఆస్తి బదిలీని ప్రభావితం చేసే బకాయిలు మరియు అటువంటి బకాయిలు ఏవైనా ఉంటే, తేదీనాటికి బకాయిలు మరియు ఇంకా రావాల్సిన బకాయిలకు (చట్టబద్ధమైన లేదా ఇతరత్రా) ఎ.ఒ. బద్యత వహించరు. విజయవంతమైన కొనుగోలుదారుచే భరించబడుతుంది. ఐడిబిఐ దాని గురించి సమాచారాన్ని అందించడానికి ఎటువంటి బాధ్యత తీసుకోరు. విజయవంతమైన బిడ్డర్ స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఖర్చులు, పన్ను బాధ్యతలు వంటి అన్ని అవసరమైన ఖర్చులను భరించవలసి ఉంటుంది.
డి) బిడ్ డ్యాకుమెంట్‌లలో పేర్కొన్న స్థిరాస్తి ఐడిబిఐకి అనుకూలంగా రుణగ్రహీతలు/లు సృష్టించిన ఛార్జీలు/తనఖాలు, బిడ్ డాక్యుమెంట్‌లలో ఇవ్వబడిన వివరాలు ఆధారంగా ఉంటాయి. ఆసక్తిగల పార్టీలు స్థిరాస్తి వివరాలను ధృవీకరించాలని మరియు అభ్యర్థనపై ఎ.ఒ. వద్ద అందుబాటులో ఉన్న దానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేయాలని అభ్యర్థించారు.
ఇ) స్థిరాస్తి ఐడిబిఐ యొక్క ఛార్జీలు మరియు భారాల నుండి ఉచితంగా విక్రయించబడుతోంది.
ఎఫ్) ఇవేలం నమోదు / మద్దతు కోసం సంప్రదించండి: మెస్సర్స్ అంటార్స్ సిస్టమ్స్ లిమిటెడ్, 'హొంగసను', నెం. 137/3, బెంగుళూరు మైసూరు రోడ్, మెట్రో పిల్లర్ పి-696 ఎదురుగా, కెంగెరి, బెంగుళూరు-560060, ఫోన్: 080-45982100 లేదా వారి ప్రతినిధి కుమారి సుస్మిత మరియు శ్రీమతి మెరీన - 8951944383 / 9686196751, ఇ మెయిల్: sushmitha.b@antaressystems.com /marina.j@antaressystems.com మరియు వెబ్‌సైట్: www.bankeauctionwizard.com.
జి) ఆసక్తి గల బిడ్డరు/పార్టీలు బిడ్ డాక్యుమెంట్‌ను పొందవచ్చు. ఇందులో విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతులు, బిడ్ ఫారమ్‌లు మొదలైనవి ఐడిబిఐ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు (www.idbibank.in) లేదా ఎ.ఒ. ను సంప్రదించండి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, దానవాయిపేట పార్క్ రోడ్, రాజమండ్రి, ఇ మెయిల్ : n.rajesh@idbi.co.in మొబైల్: 9848773892 మరియు ఇ మెయిల్: gvs.rao@idbi.co.in / మొబైల్: 9176103848 కు సెప్టెంబర్ 02, 2024 నుండి సెప్టెంబర్ 18, 2024 వరకు ఏదైనా పని రోజున వ్యక్తిగతంగా పై చిరునామాలో సంప్రదించవచ్చును.
హెచ్) ఐడిబిఐ మరియు ఎ.ఒ. స్థిరాస్తిలో ఏదైనా లోపాలు/తప్పిదాలు/వ్యత్యాసాలు/లోటు మొదలైన వాటికి లేదా ఏదైనా అనుమతులు మొదలైన వాటికి లేదా చట్టం ద్వారా స్థాపించబడిన ఏదైనా అధికారం యొక్క బకాయిలకు బాధ్యత వహించవు. ఐడిబిఐ మరియు ఎ.ఒ. ఈ విక్రయ ప్రకటనలో ఏదైనా పొరపాటు సరికాని లేదా లోపానికి బాధ్యత వహించదు.
ఐ) ఏ కారణం(ల)ను కేటాయించకుండా ఏదైనా లేదా అన్ని బిడ్‌లను అంగీకరించే లేదా తిరస్కరించే హక్కు ఎఒకి ఉంది. ఒకవేళ అన్ని బిడ్‌లు తిరస్కరించబడినట్లయితే చట్టంలో సూచించిన విధంగా ఏదైనా పద్ధతిలో ఆస్తులను విక్రయించే హక్కు ఎఒకు ఉంది.
జె) కింది షరతులను ఏదైనా బిడ్డర్ ప్రత్యేకంగా గమనించవచ్చు: 1) వేలం కోసం ఉంచిన ఆస్తులు 2018 ఎఫ్ఐఆర్ నెం. ఆర్.సి 02(ఎ) ప్రకారం సిబిఐ, ఎసిబి, విశాఖపట్నం దర్యాప్తులో ఉన్నాయని మరియు విశాఖపట్నంలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో ఉన్నాయని గమనించాలని ఆసక్తిగల బిడ్డర్లు అభ్యర్థించారు. 2) సిబిఐ, ఎసిబి, విశాఖపట్నం 26-4-2018 మరియు 06-07-2021 నాటి లేఖ సిబిఐ నుండి నిర్దిష్ట క్లియరెన్స్ లేకుండా అసలు టైటిల్ డీడ్‌లను విడుదల చేయవద్దని బ్యాంక్‌కు సూచించింది, అయినప్పటికీ, విజయవంతమైన వేలం కొనుగోలుదారు పేరుమీద ఎస్‌ఆర్‌ఓలో సేల్ సర్టిఫికెట్ రిజిష్టర్ చేసుకోవడానికి అంగీకరించింది. 3) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విశాఖపట్నం 08-06-2018 నాటి లేఖ ద్వారా తనఖా పెట్టబడిన / తాకట్టు పెట్టిన ఆస్తుల అసలు ఆస్తి పత్రాలను బ్యాంక్ సురక్షిత కస్టడీలో ఉంచాలని మరియు వారి సమ్మతి లేకుండా విడుదల చేయవద్దని బ్యాంక్‌కి సూచించింది. 4) 2018 ఎఫ్ఐఆర్ నెం. ఆర్‌సి 02(ఎ) లో సబ్జెక్ట్ ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించి ఒరిజినల్ టైటిల్ డీడ్‌లు సిబిఐ వద్ద ఉన్నాయి.

తేది:30-08-2024,
ప్రదేశం : రాజమండ్రి

సం/- అధీకృత అధికారి,
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్యుడు సందీప్

నిట్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 30 : విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనలు వెలికితీయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ సందీప్ అన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యులు శ్రీఫణికృష్ణ కోఆర్డినేటర్‌గా , డాక్టర్ సందీప్, డాక్టర్ శంకర్‌లు మెంటార్‌లుగా వ్యవహించారు. ప్రతీ విద్యార్థి వినూత్న ఆలోచనలు , ప్రాజెక్టులతో ముందుకు రావాలన్నారు. సెప్టెంబరు 9న నిర్వహించే ఇంటర్నల్ కాంపిటేషన్ కార్యక్రమానికి 30 టీమ్‌లు వరుకూ పాల్గొనే అవకాశాలు న్నాయన్నారు. నవంబరులో కేంద్ర ప్రభుత్వం గ్రాండ్ ఫైనల్ కార్యక్రమాన్ని నిర్వహించి విజేతల వివరాలు ప్రకటిస్తుందన్నారు. ప్రథమస్థానంలో వచ్చినవారికి రూ.లక్ష, రెండో స్థానంలో గెలిచిన వారికి రూ.50 వేలు కేంద్ర ప్రభుత్వం అందించనుందన్నారు.

రేపు నిట్‌లో అంతర్ జిల్లా యోగాసన పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 30: యోగా స్పోర్ట్స్ అసోషియేషన్ ఆఫ్ వెస్ట్ గోదావరి ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న ఏపీ నిట్‌లో ఇంటర్ డీస్ట్రిక్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఇంజమూరి మాధవరావు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని యోగా సెంటర్‌లో శుక్రవారం జిల్లా స్థాయి యోగా చాంపియన్ షిప్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, సీనియర్ ఏ,బీ,సీ కేటగిరిల్లో 10 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయసు గల వారు పాల్గొనవచ్చని వివరించారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ, ఆచార్యులు

విద్యార్థుల జ్ఞానార్జనకు సాంకేతిక శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 30: విద్యార్థుల జ్ఞానార్జనకు సాంకేతిక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ గోపాల్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో వర్సిటీ విద్యార్థులకు ఉద్యాన రంగంలో సుస్థిరత కోసం సాంకేతిక ప్రమేయంపై వర్చువల్ శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు ఏవీడీ దొరాజిరావు, భరద్వాజ్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

హార్టీ సెట్ ఫలితాల విడుదల

హార్టీకల్చర్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన హార్టీ సెట్ ఫలితాలు శుక్రవారం ఉద్యాన విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ గోపాల్ విడుదల చేశారు. 266 మంది హార్టీసెట్ పరీక్ష రాయగా 255 మంది ఉత్తీర్ణత సాధించారు. హార్టీసెట్‌లో మొదటి ర్యాంకు అనుమల విజయలక్ష్మి (సత్యసాయి జిల్లా), రెండో ర్యాంకు కుంపాటి పావని (నంద్యాల జిల్లా), మూడో ర్యాంకు గోసాల సతీష్ (ప్రకాశం జిల్లా)లు ప్రతిభ కనబరిచినట్టు వీసీ వెల్లడించారు. రిజిస్ట్రార్ శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ స్వామి, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ నాయుడు, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల నుంచి సమగ్రశిక్ష జీసీడీవో తొలగింపు

ఏలూరు అర్బన్, ఆగస్టు 30 : సమగ్రశిక్ష జీసీడీవో సబిహ సుల్తానాను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఎస్ఎస్ఏ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉర్దూ ఏఎంవోగా సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో ప్రవేశించిన ఆమె తదుపరి కాలంలో జీసీడీవోగా బాధ్యతలు చేపట్టడానికి జిల్లా ప్రాజెక్టు, కలెక్టర్ నుంచి ర్యాటిఫికేషన్, ఆ మేరకు ప్రభుత్వ అనుమతి లేకుండా సెక్టోరల్ అధికారి పోస్టులో గత కొన్నేళ్ళుగా కొనసాగుతుండటాన్ని నిబంధనలకు విరుద్ధంగా పరిగణించిన ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎస్ఎస్ఏ జిల్లా కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. పోస్టుమారిన విషయమై సకాలంలో ర్యాటిఫికేషన్‌ను జిల్లాప్రాజెక్టు అధికారులు పంపకపోవడం వల్లే ఈ తొలగింపు జరిగిందేతప్ప ఇందులో ఆమె తప్పులేదని సమాచారం. శనివారం జీసీడీవో బాధ్యతల నుంచి రిలీవ్ చేసిన అనంతరం అప్పనవీడు స్కూలుకు టీచరుగా నియమించే అవకాశాలున్నట్టు కార్యాలయ వర్గాలు వివరించాయి. కాగా కొత్తగా జీసీడీవో వేకెన్సీని భర్తీ చేసేందుకు రెండు రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ పోస్టుకోసం ముసునూరు ఎంపీయూపీ స్కూలులో పనిచేస్తున్న ఓ టీచరు దరఖాస్తు చేసుకోగా తుది నియామకం ఈమెకే ఖరారయ్యే చాన్స్ ఉన్నట్టు సమాచారం.

టీచర్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఎస్టీయూ కార్యాచరణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 30 : ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో నిర్వహించనున్న ఉప ఎన్నికలకు జిల్లాలో అర్హతలు గల ఉపాధ్యాయులు, అధ్యాపకులతో త్వరితగతిన ఓటు నమోదు చేయించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయు) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ సంఘ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరులోని సంఘజిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళుగా ప్రభుత్వ విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి త్వరలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ సంఘాల అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే టీచర్ల హక్కులను పరిరక్షించుకోగలమన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ శనివారం నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి ఓటరు నమోదు పత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. సంఘ సీనియర్ నాయకులు ప్రసాదరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, రవిచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



72 గంటల ప్రసారంలో పాల్గొన్న విద్యార్థులు

గిన్నిస్ రికార్డులోకి ‘ విష్ణు 90.4 రేడియో’

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 30: భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కమ్యూనిటీ రేడియో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. విద్యా సంస్థల్లోని 100 మంది విద్యార్థులు నిరంతర రేడియో ప్రసారాన్ని నిర్వహించి రికార్డు నెలకొల్పారు. విష్ణు 90.4 కమ్యూనిటీ రేడియోలో 2022 డిసెంబరు 7,8,9 తేదీల్లో 72 గంటల 30 నిమిషాల 30 సెకన్లు నిరంతరాయంగా 100 మంది విద్యార్థులు ప్రసారాలు నిర్వహించారు. హాస్టల్ జీవితం, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆహారం, వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణం ఇలా వివిధ రంగాల్లో అంశాలపై విద్యార్థులు రేడియోలో లైవ్ ప్రసారం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో కార్య క్రమం జరిగింది. అనంతరం విష్ణు కళాశాల యాజమాన్యం ఆ ప్రసారాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యాలయానికి పంపింది. దానిపై 140 పర్యాయాలు గిన్నిస్ బుక్ ప్రతినిధులు చర్చల అనంతరం నిర్ధారణ చేసిన తర్వాత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును ప్రకటించింది. సర్టిఫికెట్‌ను విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు శుక్రవారం ఆవిష్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు..పక్కన మంత్రి దుర్గేష్, జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, జేసీ తదితరులు

హాట్..హాట్‌గా
జడ్పీ సర్వసభ్య సమావేశం

జడ్పీ చైర్‌పర్సన్‌పై ఎమ్మెల్యే చింతమనేని ఆగ్రహం
జిల్లా అభివృద్ధే లక్ష్యంగా కలిసి పనిచేద్దాం : మంత్రి నిమ్మల
ప్రజలకు చేరువుగా మెరుగైన పాలన : మంత్రి దుర్గేష్

ఏలూరుసిటీ, ఆగస్టు 30: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా శుక్రవారం జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం హాట్‌హాట్‌గా జరిగింది. ఎమ్మెల్యేలు వివిధ సమస్యలను ప్రస్తావించే సమయంలో జడ్పీ చైర్‌పర్సన్‌కు దెందులూరు ఎమ్మెల్యేకు మధ్య వాగ్వివాదం జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యంతో ఆ వివాదం సద్దుమణిగింది. దెందులూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ కొనుగోలు చేశారని, ప్రస్తుతం ఆ మిషన్ అక్కడ లేదని, ఆ మిషన్‌ను ఎవరు ఎక్కడికి తరలించారో చెప్పాలని ఆరోగ్యశాఖ అధికారులను ఎమ్మెల్యే చింతమనేని నిలదీశారు. జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని సబ్జెక్ట్ మాత్రమే మాట్లాడాలని అనడంతో చింతమనేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు చెప్పుకోవటానికి ఇదొక వేదికని మమ్మల్ని మాట్లాడ వద్దనడం ఏమిటని ప్రశ్నించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరపాల్సిన సమావేశాన్ని మొక్కుబడిగా ఒక పూటలో పూర్తి చేయాలనుకోవటం ఏమిటని నిలదీశారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు మాట్లాడేందుకు సమయం లేకుండా పోతోందని, పూర్తి స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అధికారులు, ఎమ్మెల్యేలతో కలిపి సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు చర్చించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అధ్యక్షత వహించిన జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతానికి 15వ ఆర్థిక సంఘ నిధులను గ్రామ, మండల, జిల్లా పరిషత్‌లకు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా అందరం కలిసి పని చేద్దామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.జడ్పీ సమావేశాలు ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు జడ్పీ సమావేశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే వారన్నారు. గత ఐదేళ్ళలో జడ్పీ సమావేశాలు కేవలం మొక్కుబడిగా జరిగాయే తప్ప సమస్యల పరి ష్కారంలో చర్యలు తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంట అమ్మిన రైతులకు 1600 కోట్లు రూపాయలు బకాయిలు పడితే తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ బకాయిలు చెల్లించామన్నారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినందు వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని చంద్రబాబు ప్రధాన మంత్రిని, ఆర్థిక శాఖామంత్రిని కలిసి రూ.12,157 కోట్లు పోలవరం ప్రాజెక్టుకు మంజూరు చేయించారన్నారు. రైతుల అభిప్రాయాల మేరకు రాబోయే రోజుల్లో నీటి సంఘాల ఎన్నికలు ఏర్పాటు చేసి సంఘాలకు కాల్వల బాధ్యతలను అప్పగిస్తామన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులు, పునఃనిర్మాణాలకు 128 రోడ్లను గుర్తించామన్నారు. గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటు న్నామన్నారు.

రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక వ్యవహారాల శాఖామంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రజలకు చేరువుగాప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మెరుగైన పాలన అందిస్తామని స్పష్టం చేశారు. గత ఐదేళ్ళలో కుంటుపడిన నీటిపారుదల, వ్యవసాయం, విద్యా, వైద్యం, ఇళ్ళ నిర్మాణాల ప్రగతిని తిరిగి పట్టాలెక్కించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెంపుదల చేసిన పెన్షన్‌లు పంపిణీ చేశామని , అదే విధంగా ఈ రోజు వనమహోత్సవాన్ని అద్భుతమైన కార్యక్రమంగా నిర్వహించుకుంటు న్నామన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ భారీ వర్షాలు , వరదల వల్ల జూలై నెలలో రైతాంగం నష్టపోయారని దీనికి సంబంధించిన పంట కాల్వల్లో పూడికతీత, గుర్రపుడెక్క తీయించి పంటను కాపాడాలన్నారు. ధాన్యం సేకరణ విషయంలో గత ప్రభుత్వం చిరిగిన గోనె సంచులు అందించటం వల్ల రైతులు నష్టపోయారన్నారు.

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా గోదావరి వాటర్‌ను ఇంటింటికీ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొవ్వూరులో పక్కనే గోదావరి నది ఉన్నప్పటికీ బోరునీటికే పరిమితమయ్యారని మూడు మండలాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా గోదావరి మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఆస్పత్రులలో కనీస సౌకర్యాలు లేవని వీటిపై శ్రద్ధ వహించి తక్షణమే సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో నూతన ఎక్స్‌రే యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, కొవ్వలి కొత్తపేటలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయని దీనిని అరికట్టటానికి చర్యలు తీసుకోవాలన్నారు, కొన్నిచోట్ల స్కూళ్ళలో నీరు నిల్వ ఉండి విద్యార్థులు నడిచే పరిస్థితి లేకుండా ఉందని దీనిపై యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పత్సమట్ల ధర్మరాజు, మద్దిపాటి వెంకట్రాజు, చిర్రి బాలరాజు, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఎఫ్‌వో రవీంద్రధామ, జడ్పీ సీఈవో సుబ్బారావు పాల్గొన్నారు. జడ్పీ సమావేశం అనంతరం వ్యవసాయ విస్తరణ కార్యక్రమం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను రాష్ట్ర మంత్రులు నిమ్మల , కందుల దుర్గేష్‌లు ఆవిష్కరించారు.

స్థాయీ సంఘాల ఏర్పాటు

సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ 1 నుంచి 7వ స్థాయి సంఘం వరకు ఉన్న కమిటీలను ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన గౌరవ సభ్యుల పేర్లను ఆమోదించారు

1వ స్థాయి సంఘం కమిటీ (ప్రణాళిక, ఆర్థిక స్థాయి) : ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్‌కుమార్ , ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.

2.గ్రామీణాభివృద్ధి కమిటీ : నరసాపురం పార్లమెంట్ సభ్యులు భూపతి రాజు శ్రీనివాసవర్మ, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.

3.వ్యవసాయ కమిటీ: నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు.

4.విద్య, వైద్యసేవలు : భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు.

5. మహిళా సంక్షేమ కమిటీ: కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

6. సాంఘిక సంక్షేమ కమిటీ: తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్.

7వ స్థాయి సంఘం (పనుల స్థాయి కమిటీ): రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు.


హాజరైన ఎమ్మెల్యేలు ముప్పిడి, బడేటి చంటి, ధర్మరాజు, ఆరిమిల్లి , రోషన్ కుమార్, మద్దిపాటి, చింతమనేని, స్థానిక ప్రజాప్రతినిధులు

బ్రాహ్మణ చెరువులో ఎలక్ట్రిక్ కారు దగ్ధం
ప్రమాదం నుంచి బయట పడ్డ పెనుమంట్ర ఎంపీపీ



పెనుమంట్ర, ఆగస్టు 30 : పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఎలక్ట్రికల్ కారు నుంచి మంటల వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం పెనుమంట్ర మండల ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి (వాసు రెడ్డి)పాలకొల్లు నుంచి ఎస్ ఇల్లింద్రపర్రు ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో తన కారులో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన ఎంపీపీ వాసు రెడ్డి కారు దిగి ప్రమాదం నుంచి బయటపడ్డారు. కారు పూర్తిగా కాలి దగ్ధమైంది. మంటలు వ్యాపించడానికి కారణం బ్యాటరీ, లేక షార్ట్ సర్క్యూటా అన్నది తెలియాల్సి ఉంది. పెనుమంట్ర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ మద్దాలకు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం



ద్వారకాతిరుమల, ఆగస్టు 30: పుస్తకాలే సమాజాన్ని ప్రభావితం చేస్తాయని ఎన్టీఆర్ లిటరేచర్, వెబ్‌సైట్ కమిటీ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు జనార్ధన్ అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్, శంకరం వేదికల నేతృత్వంలో విజయవాడలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పంగిడిగూడెం జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా చేస్తున్న డాక్టర్ మద్దాల పెద్దిరాజుకు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం అందజేశారు. ఆయన రచించిన స్మైల్ రచనలు-అనుశీలన అనే పరిశోధనా పుస్తకానికి ఈ పురస్కారం అందించారు. గిడుగు వారి ముని మనవ రాలు గిడుగు కాంతి కృష్ణ, టీడీ జనార్ధన్, నవ్యాంధ్ర రచయితల సంఘ అధ్యక్షుడు బిక్కి కృష్ణ, కంఠంనేని రవిశంకర్, డాక్టర్ విద్యాధర్, కె.శ్రీనివాస్‌గౌడ్, కలిమిశ్రీ ఈ పురస్కారాన్ని అందించినట్లు పెద్దిరాజు తెలిపారు. హెచ్ఎం సురేష్, ఎంఈవోలు సుబ్బారావు, వెంకట్రావు ఉపాధ్యాయులు అభినందించారు.

క్రైం కార్నర్

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం
యువకుడు మృతి..ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి


చికిత్స పొందుతున్న యువతి.. మృతి చెందిన రాజేష్


పాలకొల్లు రూరల్, ఆగస్టు 30 : ప్రేమ జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా యువకుడు మరణించగా, యువతి తీవ్ర గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. భీమవరం రైల్వే ఎస్ఐ రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం పాలకొల్లు పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల వద్ద యువకుడు మృతి చెంది ఉండగా యువతి తీవ్ర గాయాలతో కనిపించడంతో స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణపవరం మండలం ఎస్.కొండేపాడుకు చెందిన వెన్నెల రాజేష్ (20), భీమవరం శివారు దుర్గాపురానికి చెందిన ఒక యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్ళికి పెద్దలు అంగీక రించకపోవడంతో గురువారం రాత్రి బైక్‌పై భీమవరం నుంచి పాలకొల్లుకు చేరుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినట్టు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి తెలిపింది. ఇద్దరూ పట్టాలపైకి చేరుకున్నామని రైలు దగ్గరకు రాగానే తనను పక్కకు నెట్టివేశాడని కొద్దిసేపటి తరువాత తనకు స్పృహ వచ్చిందని యువతి తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. తమ కుమార్తె తప్పి పోయిందదని యువతి తల్లిదండ్రులు భీమవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రాజేష్‌కు గతంలో పెళ్ళి జరిగి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్టు సమాచారం.

స్థలవివాదం..హత్య కేసులో ఐదుగురి అరెస్టు

భీమడోలు, ఆగస్టు 30 :భీమడోలు మండలం అర్జావారిగూడెం ప్రాంతంలో ఆస్తి తగాదాల నేపథ్యంలో వ్యక్తిపై కత్తితో దాడిచేసి మహిళను గాయపర్చిన కేసులో ఐదుగురుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భీమడోలు సీఐ రవికుమార్ తెలిపారు. ఈనెల 28వ తేదీన అర్జావారిగూడెంలో ఆస్తి తగాదాల నేపథ్యంలో కన్నకూతురు రాజారాణిపై దాడి చేసి అడ్డు వచ్చిన చేబత్తిన కృష్ణ మెడపై నరికి అతని మృతికి కారణమైన తడపల దుర్గారావు, తడపల వెంకటేశ్వరరావు, తడపల ప్రశాంత్, తడపల వీరయ్య, తడపల వివేక్‌లను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఏలూరు శౌరిపురంలో చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 30 : ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్ళి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు సమీపంలోని వట్లూరు పంచాయతీ శౌరిపురంలో నివాసం ఉంటున్న ఆకుకూరి అన్నమ్మ తన కుటుంబ సభ్యులతో ఈనెల 22న బంధువుల ఇంటికి ఊరు వెళ్ళారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బంగారు చైను, చెవిదిద్దులు, మంగళ సూత్రాలు, ఒక రింగుల, మొత్తం మూడు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో చిన్నారి మృతి

అత్తిలి, ఆగస్టు 30 : డెంగీతో చిన్నారి మృతి చెందింది.అత్తిలి గ్రామానికి చెందిన గోనా సుబ్బారావు కుమార్తె నిత్యశ్రీ పద్మ (6) అత్తిలి మదర్ మెర్సిల్లా పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. మూడురోజుల క్రితం పాపకు జ్వరం రావడంతో తణుకులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా డెంగీ జ్వరంగా నిర్ధారించి వైద్యం అందించారని, అయితే గురువారం బాలిక పరిస్థితి విషమించడంతో విజయవాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం బాలిక మృతి చెందిందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిషోర్

వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 30 : వినాయక చవితి ఉత్సవాలు ఎదుటి వారికి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ప్రజలకు సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పెద్ద శబ్దాలతో లౌడ్ స్పీకర్లను వినియోగించకూడదన్నారు. వినాయక ఉత్సవ కమిటీ వారు ముందుగానే పోలీసు అనుమతి తీసుకోవాలని హెచ్‌టిటిపిఎస్//గణేష్‌ఉత్సవ్.నెట్‌కు కాని, లేదా వాట్సప్ ఫోన్ నెంబర్ 79950 95800కు హాయ్ అని టైప్ చేసిన తరువాత ఒక లింక్ వస్తుందని ఆ లింక్‌పై క్లిక్ చేస్తే ఓటీపీ వస్తుందన్నారు. ఆ తరువాత అప్లికేషన్ కోసం గూగుల్ ఫారమ్ ఓపెన్ చేసి అందులో ఉన్న కాలమ్స్ పూర్తిచేసి సబ్‌మిట్ చేయాలన్నారు. అనంతరం పోలీసులు విచారణ జరిపి సింగిల్ విండో పద్ధతి ద్వారా పర్మిషన్ మంజూరవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్టు 30 అమలులో ఉందని, ఎవరైనా ఉల్లంఘిస్తే సెక్షన్ 32 పోలీస్ యాక్టు ప్రకారం కాని లేదా బీఎన్ఎస్ సెక్షన్ 223 ప్రకారం ఆరు నెలల శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా లేదా రెండూ విధించబడతాయన్నారు. నిర్వాహకులు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. రోడ్డుకు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం ఉపయోగించకూడదని ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే లౌడ్ స్పీకర్లను వినియోగించుకోవాలన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. నిమజ్జనానికి సంబంధించిన రూటు మ్యాప్‌ను ముందే తెలియజేయాలన్నారు. ఊరేగింపుల్లో బాణసంచా ఉపయోగించరాదని, డీజే శబ్దాలు, అస్లీల డాన్సులు నిరోధించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకూడదన్నారు. పోలీస్ శాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీతో పాటు ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

జిల్లాలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు


తక్కెళ్లపాడులో పశువులకు టీకాలు వేస్తున్న జేడీ నెహ్రూబాబు

ద్వారకాతిరుమల, ఆగస్టు 30: గాలికుంటు వ్యాధి నుంచి రక్షణకు పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో శుక్రవారం ఆయన 420 పశువులకు టీకాలు వేయించారు. జిల్లాలో ఈ టీకాలతో పాటు 4-6 నెలల వయసున్న పెయ్యి దూడలకు బ్రూసెల్ల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ బ్రూసెల్ల టీకాలను ఒక్కసారి వేయిస్తే జీవితాంతం పనిచేస్తాయన్నారు. సెప్టెంబరు 18 వరకూ ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. భీమడోలు ఏడీ సాయి రమేష్, మండల పశు వైద్యాధికారి అంగర సురేష్ పాల్గొన్నారు.

ఇసుక అమ్మకాలపై ఏసీబీ విచారణ

కుక్కునూరు, ఆగస్టు 30: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుక్కునూరు మండలంలోని ఇసుక రీచ్‌ల ద్వారా జరిగిన ఇసుక అమ్మకాలపై రెండు రోజులుగా ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నారు. కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట, వింజరం, బూరుగువాయి కేంద్రాలుగా ఇసుక అమ్మకాలు జరిగాయి. ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌కి అనుమతి ఉన్నప్పటికి అక్కడ ఇసుకను జిల్లాలోని ప్రజల అవసరాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంది. అలాగే బూరుగవాయి రీచ్‌కు అనుమతిలేనప్పటికి యథేచ్ఛగా తవ్వారు. తవ్విన ఇసుకను తెలంగాణాకు కూడా అక్రమంగా తరలించినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ఇదిలా ఉండగా ఏసీబీ అధికారులు గత ప్రభుత్వ హయాంలో జరిగిన తవ్వకాలపై రెండురోజులుగా కుక్కునూరు మండలంలో విచారణ జరుపుతున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సూత్రధారులు ఎవరనేది సమాచారం సేకరిస్తున్నారు.


అమ్మవారిని వేదిక వద్దకు తీసుకువస్తున్న దృశ్యం

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 30: చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రంలో సామూ హిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అనివేటి మండపంలో దాదాపు రెండు వేలమంది ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. ముందుగా వెండి తొళక్కం వాహనంపై వరలక్ష్మీ అమ్మవారిని ఉంచి అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్ఛరణల నడుమ అట్టహాసంగా అనివేటి మండప వేదిక వద్దకు తీసుకువచ్చారు. అలంకరించిన వేదికపై అమ్మవారిని ఉంచి హారతులు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క, గాజులను పంపిణీ చేశారు.

శాస్త్రోక్తంగా..పవిత్రారోహణ



లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పవిత్రారోహణ ఆలయంలో శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ యాగశాలలో ఉంచిన పవిత్రాలను శిరస్సులపై ఉంచుకుని అర్చకులు, పండితులు, ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం పవిత్రాలను శ్రీవారి మూలవిరాట్‌పైన, అమ్మవార్లపైన, ఉత్సవమూర్తులపైనా ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర. జగన్నాధుల మూలవిరాట్‌లు, ఆళ్వార్‌లపై పవిత్రాలను వేశారు. పవిత్రాంగ హోమం, శాంతి హోమాలను జరిపారు.

కుళాయిల్లో మురుగు నీరు
ఫిర్యాదులు చేస్తున్నా స్పందించని అధికారులు



నరసాపురం, ఆగస్టు 30: నరసాపురంలోని స్టీమర్‌రోడ్, పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ఎనిమిది రోజులుగా కూళాయిల్లో మురికి నీరు వస్తున్నది. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఇదే తంతు. గృహాలకు నీటిని అందించే మెయిన్ పైప్‌లైన్‌లో డ్రైనేజీ నీరు కలవడంతో ఆ నీరంతా కలుషితమై కుళాయిల్లోకి వస్తోంది. దుర్వాసన భరించ లేకపోతున్నారు. పొరపాటున ట్యాంకుల్లోకి నీరు ఎక్కితే చాలు మొత్తం ట్యాంక్ అంతా శుభ్రం చేసుకోవాల్సి వస్తుంది. బోర్ వేసి నీళ్లు పడుతుంటే దుర్వాసన వస్తున్నది. ఈ విషయాన్ని చాలా మంది మునిసిపల్ ఆధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరికొందరు ఆర్డీవో దృష్టిలో కూడా పెట్టారు. అయినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. దీంతో తాగేందుకు, వంటలు చేసుకునేందుకు ఆర్వో వాటర్ కొనుక్కుంటున్నారు. దీనిపై మాధవాయి పాలెంలో నివాసం ఉంటున్న వ్యాపారి సతీష్ మాట్లాడుతూ పదిరోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని మునిసిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నా స్పందన లేదు. నీటిని బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. కూళాయిల్లో ఇవే నీరు. దీనిపై ఏఈ సునీల్ వివరణ ఇస్తూ మురికినీరు ఎక్కడ కలుస్తుందన్న దానిపై చాలాచోట్ల తవ్వి చెక్ చేస్తున్నాం. రెండ్రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

క్రీడా పోటీలకు సహాయ సహకారాలు అందిస్తా

» జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం టౌన్, ఆగస్టు 30 : క్రీడలకు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలనుసారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడా పోటీలు ముగిశాయని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఎం.రాజేష్ తెలిపారు. శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి జె. ఉదయభాస్కర్, జిల్లా విద్యాధికారి జి.నాగమణి, ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రటరీ జాన్సన్ హాజరై మన జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలను, మెడల్స్ అందించి సత్కరించారు. అనంతరం ప్రస్తుతం జరిగిన యోగా, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్, రోప్ జప్పింగ్, బాస్కెట్ బాల్, రన్నింగ్ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

'క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలి'

తణుకు, ఆగస్టు 30: విద్యార్థినులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని ఎస్కేఎస్డీ మహిళా కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని బి.నాగలక్ష్మీదుర్గ పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ యుఎల్ సుందరీబాయ్ తెలిపారు. విద్యార్థినిని కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అభినందించారు. పీడీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పవన్ ప్రతిపక్ష హోదా కోరాలి : సీతారాం



మాట్లాడుతున్న సీతారాం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 30: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ ప్రతిపక్ష హోదా తీసుకుని వ్యవహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం సూచించారు. తాడేపల్లిగూడెంలోని సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నిరంకుశ పాలన సాగిస్తోందన్నారు. కేంద్రంలో బలమైన అధికార భాగస్వామిగా ఉన్న టీడీపీ ప్రత్యేక హోదా కోసం అడగాలన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న జ్వరాల అదుపునకు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్ తదితరులు మాట్లాడారు.

'కళాశాలల్లో విద్యార్థినులకు రక్షణ కల్పించాలి'

భీమవరం ఎడ్యుకేషన్/ఆకివీడు, ఆగస్టు 30 : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలపై విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం భీమవరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.ఈశ్వర్, టి.ప్రసాద్ మాట్లాడుతూ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినుల హాస్టల్‌లో హిడెన్ కెమెరాలు ఏర్పాటు తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. యాజమాన్యం పరిరక్షణ లోపమే ప్రధాన కారణమన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆకివీడులో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు సందక ఉదయకుమారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు డోకల లక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

కాళ్ళ, ఆగస్టు 30 : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు సూచించారు. కోలనపల్లి గ్రామంలో సివిల్ రైట్స్‌డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు సమస్యలపై స్పందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరాలను తెలుసుకోవాలని, సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఈ.నాగార్జున, సర్పంచ్ కె.సూర్యనారాయణమూర్తి, అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

భీమవరంటౌన్, ఆగస్టు 30: వినాయక చవితి వేడుకలలో మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని సర్ సీవీ రామన్‌స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సర్ సీవీ రామన్ స్కూల్లో మట్టి వినాయక విగ్రహాలనే వాడాలని అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి కాలుష్యంతో వాతావరణం దెబ్బతింటుందని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఉపాధ్యాయులు శైలజ, కె.పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కాల్వలోకి మురుగునీరు వదిలితే చర్యలు

ఆకివీడురూరల్, ఆగస్టు 30 :దుంపగడప మంచినీటి చెరువుకు నీరందించే పంటకాల్వలోకి మురుగునీరు వదిలితే కఠిన చర్యలు తప్పవని సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, పాలకవర్గం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఆకివీడు, దుంపగడప గ్రామాల పరిధిలోని నివాసాలు, కల్యాణ మండపాలు నుంచి మురుగునీరు నేరుగా పంట కాల్వలోకి వదిలివేస్తున్నారని వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామ ప్రజారోగ్యం దృష్ట్యా రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ఆకివీడు, ఆగస్టు 30 :ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న ఇరవై నాలుగు మంది విద్యార్థులకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయురాలు డి.సత్యకుమారి ఆర్థిక సహకారంతో సహకారంతో శుక్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులు ఉత్తీర్ణులై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భీమవరం క్రైం, ఆగస్టు 30 : యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే భవిష్యత్ నాశనమవుతుందని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సరదా కోసం మాదక ద్రవ్యాలు తీసుకుంటే నష్టం తప్పదని, అటువంటి సరదాలు వద్దని సూచించారు. సీనియర్ న్యాయవాదులు కేవీ రమేష్, ఆడబాల శ్రీనివాస్, ఎన్. గోపాలకృష్ణ, బీవీ రత్నం, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు.

చింతపర్రులో 34 మంది జూదరుల అరెస్ట్

» రూ.1.30 లక్షల నగదు.. 34 సెల్‌ఫోన్‌ల స్వాధీనం

పాలకొల్లు రూరల్/ఆచంట, ఆగస్టు 30: పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామంలో పేకాట శిబిరంపై పాలకొల్లు సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎస్ఐ గుర్రయ్య, సిబ్బంది శుక్రవారం రాత్రి దాడి చేశారు. పేకాట ఆడుతున్న 34మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,30,000 నగదు, 34 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

ఆచంట వేమవరంలో నలుగురు..


ఆచంట వేమవరంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 55 వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె. వెంకటరమణ తెలిపారు.



భీమవరం బాలా త్రిపురసుందరి ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు



ఆకివీడులో దుర్గమ్మకు పసుపు కొమ్ముల అలంకరణ



పాలకొల్లులో పది వేల గాజుల అలంకరణలో పార్వతీ అమ్మవారు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

భీమవరంటౌన్, ఆగస్టు 30 :పట్టణంలోని గునుపూడి గ్రామ దేవత శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల ఆలయంలో సుమారు 700 మంది మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. టూటౌన్‌లోని రామరాజుతోటలోని మావుళమ్మ ఆలయంలో, మెంటే వారితోటలోని బాలత్రిపుర సుందరిదేవి ఆలయంలో 108 మంది మహిళలచే సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేంకటేశ్వర కల్యాణ మండపంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు. ఈమేరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

- పాలకొల్లు అర్బన్ :క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహికంగా సుమారు 1200 మంది మహిళలు వరలక్ష్మీ దేవి వ్రతాలు నిర్వహించారు. ఆలయంలోని పార్వతీ దేవిని, లక్ష్మీదేవిని పది వేల గాజులతో అలంకరించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎంఎస్ స్వామి పర్యవేక్షించారు.
- పెనుగొండ : పెనుగొండ మండలం వడలిలో గ్రామ దేవత మందాలమ్మ ఆలయంలో ఆలయ అర్చకుడు దుగ్గిరాల నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.
- మొగల్తూరు : మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు, గోపూజ, గౌరీ కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి రూపు, పసుపు, కుంకుమ అందించారు.

ఆలయాల్లో శ్రావణమాస ఆఖరి శుక్రవారం పూజలు

శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని పలు దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి. మహిళలకు పూజా సామగ్రిని దేవస్థానాలు ఏర్పాటు చేశాయి. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు.

- ఆకివీడు : ఆకివీడులోని పెద్దింట్లమ్మ, వనువులమ్మ, గంగానమ్మ-మద్దిరావమ్మ, దండుమారెమ్మలను ప్రత్యేకంగా అలంకరించారు. కనకదుర్గమ్మను పసుపు కొమ్ములతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- గణపవరం: గణపవరం కంచి కామాక్షి, కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ తెలగారెడ్డి బాబి దంపతుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామాచర్చనలు నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ బైరబోయిన మాల్యాద్రి యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో ధనలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహించి అన్నసమారాధనలు నిర్వహించారు.
- అత్తిలి : శ్రావణ శుక్రవారం సందర్భంగా ఐశ్వర్యదుర్గ ఆలయంలో అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం దాత పి.చంటి ఆర్థిక సాయంతో అన్నదానం జరిగింది. కమిటీ సభ్యుడు దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందిస్తున్న దాతలు

భీమవరం టౌన్,ఆగస్టు 30 : మావుళ్ళమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి భీమవరానికి చెందిన అయితం శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులు వారి కుమార్తె ప్రణతి పేరుమీద లక్ష నూట పదహారు రూపాయలు విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చిన దాతలు తొలుత అమ్మవారిని దర్శించుకోగా ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వ హించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ప్రసాదాలు, శేషవస్త్రం ఫొటోను ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అందించారు.

బాధిత కుటుంబానికి ఆర్యవైశ్య సంఘం చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

పాలకోడేరు, ఆగస్టు 30: ఆపదలో ఉన్నవా రిని ఆర్యవైశ్య సంఘం తరపున చేయూత నిచ్చేందుకు తమ సంఘం ముందంజలో ఉంటుందని ఉండి నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘ నాయకులు సన్నిది రాము వెంకటేశ్వరరావు, గొంట్ల గణపతి, గుర్రం శ్రీనివాసరావు, కందికట్ల రఘురాము అన్నారు. విస్సాకోడేరుకు చెందిన మండా సోమేశ్వరరావు కుమారుడు చిన్నప్పటి నుంచి మానసిక దివ్యాంగుడిగా ఉంటున్నాడు. ఆయన భార్య లక్ష్మీసత్యవతి సైతం మంచాన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు శుక్రవారం ఆ కుటుంబానికి రూ.లక్షా ఐదు వేలు నగదును అందించారు. చలంచర్ల సుబ్రహ్మణ్యం, రఘురాములు, సన్నిధి నాగేశ్వరరావు, రామచర్ల శ్రీనివాసరావు, నరేష్, తదితర ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



నరసాపురం డిపో వద్ద కార్మికుల ఆందోళన

ఆర్టీసీ కార్మికుల నిరసన

భీమవరంటౌన్/నరసాపురం/ తణుకు, ఆగస్టు 30 : ఆర్టీసీ కార్మికుల పట్ల ట్రెజరీ అధికారుల వైఖరిని ఖండిస్తూ కార్మికులు నిరసన చేపట్టారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం భీమవరం, నరసాపురం, తణుకు డిపో గ్యారేజ్ వద్ద కార్మికులు, నాయకులు నిరసన తెలిపారు. భీమవరంలో యూనియన్ నాయకుడు సోమరాజు మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్లకు నెల జీతంలో నైట్ అవుట్ అలవెన్సులను కలపకుండా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర యూనియన్ నాయకులు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ ఎం.డిని కలిసి వినతి పత్రం అందించినా స్పందన రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. సకాలంలో పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. భీమవరంలో జిల్లా సెక్రటరీ వైవీరావు, డిపో యూనియన్ అధ్యక్షుడు మేళంనాగబాబు తదితరులు పాల్గొన్నారు. నరసాపురంలో సంఘం కార్యదర్శి నిషారుద్దీన్, సతీష్‌బాబు, సురేష్‌బాబు, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తణుకు ధర్నాలో సంఘ జిల్లా అధ్యక్షుడు ములగాల వెంకటరత్నం, విజయవాడ జోనల్ ప్రచార కార్యదర్శి వై.వెంకట్రావు పాల్గొన్నారు.

'సనాతన ధర్మాన్ని కాపాడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం'

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 30 : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం హిందూ సనాతన ధర్మాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోందని బ్రాహ్మణ సాధికార సమితి నియోజక వర్గ కన్వీనర్ పెండ్యాల భవానీ అన్నారు. శుక్రవారం పార్వతి నగర్‌లోని తన నివాసంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అర్చకులు, పురోహితులపై ఎన్నో దాడులు చేయడం, అవమాన పరిచిందని, దేవుడి విగ్రహాలను ధ్వంసం చేసినా పట్టించుకునే నాథుడు లేడని విమర్శించారు. కూటమి పాలనలో మూడు నెలల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటోందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాలకు చెందిన 87 వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమైనట్టు గుర్తించిదని, వాటిని స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

ఆక్వా సాగుకు ఎంపెడా అనుమతులు తప్పనిసరి

యలమంచిలి, ఆగస్టు 30: వనామి రొయ్యల సాగు చేస్తున్న రైతులందరూ ఎంపెడా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మత్స్యశాఖ నరసాపురం సహాయ సంచాలకుడు సీహెచ్.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యలమంచిలి, ఆచంట మండలాల ఆక్వారైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచినీటి చేపలు, రొయ్యలు సాగుకోసం ఏపీఎస్ఏడీఏ ద్వారా అనుమతులు పొందాలన్నారు. ఫీడ్ యాక్ట్, సీడ్ యాక్ట్ ప్రకారం నాణ్యమైన సీడ్, ఫీడ్‌లను రైతులు పొందలేకపోతే సంబంధిత హేచరీలు, ఫీడ్ కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్వా సాగులో అవలంబించాల్సిన ఆధునిక యాజమాన్య పద్ధతులు, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను రైతులకు వివరించారు. ఎంపెడా టెక్నికల్ అధికారి ఎం.దుర్గారావు, ఎంపీడీవో సీహెచ్.త్రిశూలపాణి, ఎఫ్‌డీవో ఏడుకొండలు, జీవీ.సత్యనారాయణ, నాగరాజు, రాజ్‌కుమార్, లావణ్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వపరంగా 'వాసవీ ఆత్మార్పణ' అభినందనీయం

భీమవరం టౌన్, ఆగస్టు 30 : శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తామని ప్రకటించడం పట్ల ఆర్య వైశ్య వర్తక, యువజన, మండల సంఘాల సభ్యులు హర్షం ప్రకటించారు. భీమవరం ఆర్యవైశ్య సంఘ భవనంలో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, జూలూరి వెంకటేష్, కంచర్ల వెంకట రమణారావు, జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ 2025 జనవరి 31న అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాన్ని ప్రభుత్వం అవకాశమిస్తే భీమవరంలో నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణను కమిటీ సభ్యులు సత్కరించారు. సంఘం సెక్రటరీ పెరుమాళ్ళ శివ, తటవర్తి పవన్, బోండా నిషాంత్, పులవర్తి కాశీ, మండా చంద్రశేఖర్, వబిలిశెట్టి కిషోర్, సమయమంతుల నాని, అక్షింతల దుర్గ ప్రసాద్, తటవర్తి బద్రి, తటవర్తి రాజా పాల్గొన్నారు.



దహనం చేస్తున్న కార్మికుడు

విషపు టీగల పుట్ట దహనం

నరసాపురం రూరల్, ఆగస్టు 30: రుస్తుంబాద పంచాయతీ పరిధిలోని లెప్రసీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న తోటలోని మామిడిచెట్టుపై విషపుటీగలు పెట్టిన పుట్టను దహనం చేశారు. రైతులంతా కలిసి అటువంటి పుట్టను తీసే అనుభవం ఉన్న ఓ వ్యక్తిని తీసుకొచ్చి నిప్పు పెట్టించారు. తొలుత పుట్టపై పెట్రోల్ చల్లించి, కింద నుంచి కర్రసాయంతో నిప్పు అంటించడంతో పూర్తిగా కాలి కిందపడింది. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఆకన ప్రసాద్‌ను ఆ విషపు టీగలు దాడి చేశాయి. గాయపడిన అతడు భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన జరిగినప్పటి నుంచి రైతులు ఆటువైపు వెళ్లడం లేదు. చివరికి పుట్టను దహనం చేయడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

'వీవీ గిరి'లో ముగిసిన నాక్ బృందం పర్యటన

ఆకివీడు రూరల్, ఆగస్టు 30 : దుంపగడప వీవీ గిరి కళాశాలలో నాక్ బృందం పర్యటన శుక్రవారం ముగిసింది. రెండు రోజుల పర్యటనలో కాలేజీ ప్రాంగణం, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తరగతి గదులు పరిశీలించారు. పూర్వపు విద్యార్థులతో సమావేశమై కాలేజీ అభివృద్ధికి వారు చేపట్టిన కార్యక్రమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బృందం వారి నివేదికను ప్రిన్సిపాల్ సుజాతకు అందజేశారు. సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శిరీషా కులకర్ణి, నాక్ పీర్‌టీమ్ చైర్ పర్సన్ క్వాద్రి, ప్రిన్సిపాల్ సుజాత, డాక్టర్ ప్రతాప్‌కుమార్ తదితరులున్నారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ఉండి, ఆగస్టు 30: ఎన్ఆర్‌పీ అగ్రహారంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఏడు రోజుల స్వల్పకాలిక కోర్సు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వేగేశ్న శ్రీనివాసరాజు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఐటీఐ ఎలక్ట్రీషియన్ రెండో సంవత్సరం పరీక్షలు రాసే విద్యార్థులు అర్హులన్నారు. కోర్సులు పూర్తిచేసిన వారికి ప్రభుత్వ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో జిల్లాలోని పలు గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు.

దర్శిపర్రులో మొక్క నాటుతున్న సర్పంచ్ కోలా శేషవేణి



ఉత్సాహంగా వన మహోత్సవం

పాలకొల్లు అర్బన్/యలమంచిలి/ నరసాపురం/ మొగల్తూరు/ ఆచంట/ పెనుగొండ/ పెనుమంట్ర /గణపవరం/ఉండి/పాలకోడేరు/ ఆకివీడు / తణుకు/పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్ : పాలకొల్లు పంచాయతీ పరిధిలో 29శాతంగా ఉన్న మొక్కలను 50శాతా నికి పెంచే విధంగా కార్యక్రమం చేపట్టామని టీడీపీ నాయకుడు రజనీ కుమార్ తెలిపారు. పాలకొల్లు పట్టణంలోని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. యలమంచిలి మండలం బూరుగుపల్లి, లక్ష్మీపాలెం, అడవిపాలెం గ్రామాల్లో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనం నాని, టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నరసాపురం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో నిర్వహించిన వనమహోత్సవంలో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు చైర్‌పర్సన్ వెంకటరమణతో కలిసి మొక్కలు నాటారు. మొగల్తూరు మండలం మొగల్తూరు పంచాయతీ ఆధ్వర్యంలో నాగమ్మ ఆలయం వద్ద గల చెరువు చుట్టూ కొబ్బరి మొక్కలను వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, సర్పంచ్ మేరీ సత్యనారాయణ నాటారు. ఆచంట మండ లం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి ఆధ్వర్యం లో, పెనుగొండ మండలం పెనుగొండ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పం చ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి ఆధ్వర్యంలో, పెనుమంట్ర మండలం ఆలమూ రు, నత్తారామేశ్వరం, గరువు, బట్టలమగుటూరులో మొక్కలు నాటారు. గణపవరం మండలం పిప్పరలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామ కృష్ణంరాజు, జనసేన నేత కొలనువాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఉండి మండలం వెలివర్రులో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో, మహదేవపట్నంలో జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పాలకోడేరు మండలం గొరగనమూడిలో సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు, ఎంపీటీసీ కృష్ణకుమారి ఆధ్వర్యంలో మొక్కలు నాటి గ్రామస్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆకివీడు పట్టణంలోని ఎంపీపీ పాఠశాలలో ఎస్ఐ హనుమంతు నాగరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. తణుకు పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్ వద్ద మానవత సేవా సంస్థ శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పెంటపాడు మండలం దర్శిపర్రులో సర్పంచ్ కోలా శేషవేణి, ఉప సర్పంచ్ కోలా మార్కండేయులు, మానవత జిల్లా నాయకుడు తాడేపల్లి మోహన్‌రావు, కాకర్ల వినాయకం పాఠశాల వద్ద మొక్కలు నాటారు. మౌంజీపాడులో జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి మొక్కలు నాటారు. తాడేపల్లిగూడెం రూరల్ మెట్ట ఉప్పరగూడెంలో సర్పంచ్ మర్లపాటి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో తాడిపూడి కాలువగట్టు వెంబడి కొబ్బరి మొక్కలు నాటారు.